



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఎండి ఒబేదుల్లా కొత్వాల్ సాహెబ్, కలెక్టర్ శ్రీహర్ష



పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినికి పురస్కారం అందజేస్తున్న రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఎండి ఒబేదుల్లా కొత్వాల్ సాహెబ్, ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్



సింగరేణి వైద్య కళాశాలలో జెండావిష్కరణలో పాల్గొన్న అధికారులు

- డీపీఆర్ తయారీకి రూ.1.10 కోట్లు మంజూరు
- సమర్థవంతంగా సంక్షేమ పథకాలు అమలు
- అర్హులైన వారికి 6244 ఇందిరమ్మ ఇళ్లు
- రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో 161.02 కోట్లు జమ
- మహిళలకు ఉచిత ప్రయాణంతో రూ.155.80 కోట్లు ఆదా
- జిల్లాలో కొత్తగా 12,168 కుటుంబాలకు రేషన్ కార్డులు
- స్వాతంత్ర్య వేడుకల్లో రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ఒబేదుల్లా కొత్వాల్ సాహెబ్



మాట్లాడుతున్న రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఎండి ఒబేదుల్లా కొత్వాల్ సాహెబ్



జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఎండి ఒబేదుల్లా కొత్వాల్ సాహెబ్

పత్తిపాక రిజర్వాయర్‌తో

నెరవేరనున్న రైతుల ఆకాంక్ష

పెద్దపల్లి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణంతో ఈ ప్రాంత ప్రజల రైతుల చిరకాల ఆకాంక్ష నెరవేర నున్నదని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయ డంతోపాటు అభివృద్ధి పనులు వేగంగా జరుగు తున్నాయని రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ఒబేదుల్లా కొత్వాల్ సాహెబ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ప్రాంగణంలోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య దినో త్సవ వేడుకలకు హాజరైన ఆయన పోలీసులచే గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజ లను ఉద్దేశించి ప్రసంగించారు. మహాలక్ష్మి పథ కం కింద మహిళలకు, ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీ బస్సు లలో ఉచిత ప్రయాణ పథకాన్ని ప్రవేశపెట్టిం దని, దీని ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు మహిళ లకు 155 కోట్ల 80 లక్షల రూపాయలను ఆదా అయ్యాయని పేర్కొన్నారు. ప్రభుత్వం 500 సబ్సిడీ వంట గ్యాస్ అందిస్తున్నదని, జిల్లాలో ఇప్పటి వరకు 1,18, 397 కుటుంబాలకు గ్యాస్ సిలిండర్లను సరఫరా చేసి లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో 14 కోట్ల 3 లక్షల రూపాయలు జమ చేసిందన్నారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు జిల్లాలోని 1,31,966 కుటుంబా లకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నదని, ఈ పథకం ద్వారా విద్యుత్ పంపిణీ సంస్థలకు ప్రభు త్వం 85 కోట్ల 24 లక్షల రూపాయలు చెల్లిం చిందన్నారు.

● ఆసుపత్రుల నిర్మాణాలకు నిధులు

గోదావరిఖని జనరల్ ఆసుపత్రిని 160 కోట్లతో, కూనారం ఆర్‌ఓబీని 119 కోట్లతో నిర్మిస్తు న్నామని అన్నారు. ఉపాధి హామీ పనుల కింద ప్రస్తుత సంవత్సరం 44,986 కుటుంబాలకు 11 లక్షల పని దినాల ఉపాధి కల్పించి 59 కోట్ల 55 లక్షలు ఖర్చు చేశామని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద జిల్లాలో మహి ళా సంఘా లచే 27 స్టిచ్చింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి పాఠ శాల విద్యార్థుల ఏకరూప దుస్తులను కుట్టిస్తు న్నామని, 4 క్యాంటీన్, మొబైల్ ఫిష్ రిటైల్ ఔట్ లెట్‌లు ఏర్పాటు చేశామని, రెండు సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల స్థాపన వంటి వివిధ కార్యక్రమాల అమలుకు చర్యలు తీసు కుంటు న్నామన్నారు. మంథని మండలం చిల్లపల్లి గ్రామ పంచాయతీకి ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ కేట గిరీలో దీన్ దయాల్ ఉపా ధ్యాయ పంచాయతీ సతత్ వికాస్ పురస్కార అవార్డు లభించిందని అన్నారు. జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో 173 కోట్లు ఖర్చు చేస్తూ సీసీ రోడ్లు, డ్రైయిన్లు, బీటీ రోడ్లు, శ్మశాన వాటికలు ఇంటిగ్రేటెడ్ మార్కెట్, పురపాలక భవనం,

(మిగతా 8వ పేజీలో)

● జిల్లాలో 6244 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

పేద ప్రజల సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా మొదటి విడతలో అర్హులైన వారికి 6244 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి 19 కోట్ల 52 లక్షల రూపాయల నిర్మాణాలు జరుపుకుంటున్న లబ్ధిదారుల బ్యాంకు ఖాతా లలో జమ చేశామని అన్నారు. రేషన్ షాపుల ద్వారా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెం దిన వారికి ఉగాది నుంచి సన్న బియ్యం పం పిణీ చేస్తున్న ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబె ట్టుకున్న దన్నారు. అలాగే నాలుగైదేళ్లుగా రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న 12,168 కుటుం బాలకు కొత్త కార్డులు జారీ చేశామని అన్నారు.





ర్యాలీ నిర్వహిస్తున్న ధర్మారం ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఖనిలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న న్యాయమూర్తి వెంకటేష్

● రైతు భరోసా కింద రూ. 161 కోట్లు

రైతులకు రైతు భరోసా కింద ఇచ్చే పెట్టుబడి సాయాన్ని 10 వేల నుంచి 12 వేల రూపాయ లకు పెంచామని, వానాకాలం పంటకు జిల్లాలో 1,51,507 మంది రైతుల ఖాతాలో 161 కోట్ల 2 లక్షల రూపాయలు జమ చేశామని ఆయన అన్నారు. యాసంగి సీజన్‌లో 62,621 మంది రైతుల నుంచి 926 కోట్ల విలువ గల 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొను గోలు చేసి 48 గంటల్లోగా చెల్లింపులు చేశామని పేర్కొన్నారు. జిల్లాలో ఆయిల్‌పామ్ పంటను 3158 ఎకరా లలో సాగు చేస్తున్న రైతులకు 4 కోట్ల 70 లక్షల సబ్సిడీ అందించామన్నారు. కాక తీయ కాలువ కింద ఉన్న 2.30 లక్షల ఎకరాలతో పాటు కొ త్తగా 10 వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించేందుకు లక్ష్మీనరసింహస్వామి పత్తి పాక రిజర్వాయర్‌ను 3 నుంచి 5 టిఎంసీల సామ ర్థ్యంతో నిర్మాణా నికి డీపీఆర్ తయారీకి ప్రభు త్వం కోటి 10 లక్షల రూపాయలు మంజూరు చేసిందన్నారు. 13,396 ఎకరాల ఆయకట్టు స్థిరీక రణ కోసం చేపట్టిన రామ గుండం ఎత్తిపోతల పథకం పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపది కన పూర్తిచేసి నీటి పారుదల శాఖ మంత్రి చేతుల మీదుగా ప్రారం భించామన్నారు.



సింగరేణి ఆర్జీ3 జీఎం కార్యాలయంలో విద్యార్థుల నృత్య ప్రదర్శన



ఎన్టీపీసీలో సైనిక దుస్తుల్లో విద్యార్థుల విన్యాసాలు



ఎన్టీపీసీలో జాతీయ జెండాలతో విద్యార్థుల ప్రదర్శన

దేశాభివృద్ధిలో ఎన్టీపీసీ కీలక పాత్ర

జ్యోతినగర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): దేశాభి వృద్ధిలో ఎన్టీపీసీ కీలక పాత్ర పోషిస్తున్నదని, దేశానికి నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తోందని రామగుండం, తెలంగాణ ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సామంత అన్నారు. స్వాతంత్ర్య దినోత్స వం సందర్భంగా శుక్రవారం మహాత్మగాంధీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఈడీ జాతీయ జెండాను ఎగుర వేశారు. అనంతరం ప్రసంగిస్తూ దేశంలో నాల్గవ వంతు విద్యుత్ ఎన్టీపీసీ సంస్థ నుంచే దేశానికి సరఫరా అవు తున్నదన్నారు. ఉద్యోగులు, అధికారులు, కాంట్రా క్టు కార్మికులు, ఏజెన్సీల సమిష్టి కృషి ఫలితం గానే ఎన్టీపీసీ దేశంలోనే అగ్రగామి విద్యుత్ సంస్థగా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తితోపాటు సామాజిక బాధ్యతను ఎన్టీపీసీ నెరవేరుస్తున్నదని, సీఎస్ఆర్ పథకం ద్వారా ప్రభావిత ప్రాంతాలను అభివృద్ధి చేస్తు న్నామన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని తెలిపారు. కాగా, రామ గుండం ఎన్టీపీసీ ప్లాంటు మేడే పార్కులో సీజీ ఎం(ఓఅండ్ఎం) ఎ.కె.త్రిపాఠి, తెలంగాణ ఎన్టీపీసీ(టిఎస్టిపిపి) ప్రాజెక్టులో జీఎం అలోక్ రాయ్, ఏడీఎం భవనంలో జీఎం బినోయ్ జోస్ త్రివర్ణ పతాకాలను ఆవిష్కరించారు. ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్‌రాయ్‌కు సీఐఎస్ఎఫ్ వానులు గౌరవ వందనం అందజేశారు. విద్యా ర్థులు, ఎన్‌సీసీ కేడెట్లు మార్చ్‌పాస్ట్ నిర్వహిం చారు. ఎన్టీపీసీలో అత్యుత్తమ సేవలు అందిస్తు న్న ఉద్యోగులు, అధికారులు, ఐసీహెచ్ సిబ్బం దికి ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందజేశారు. ప్రభావిత ప్రాంతా లకు చెందిన విద్యార్థినులకు సీఎస్ఆర్ కింద సైకిళ్లను అందజేశారు. బాల్ భవన్, కేంద్రీయ విద్యాలయం, సెయింట్ క్లేర్ స్కూల్, సచ్‌దేవ, జెడ్పీ పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాం స్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సీఐ ఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ అరవింద్ కుమార్, ఏజీఎం(హెచ్ఆర్) విజయ్ కుమార్ సిక్దర్, ఉద్యోగులు, గుర్తింపు కార్మిక సంఘం, అధికారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎన్టీపీసీ ఈడీ చందన్‌కుమార్ సామంత

స్వాతంత్ర్య సమరయోధుల ఆశయ సాధనకు కృషి చేయాలి

● రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా

కోల్‌సిటీ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎందరో త్యాగధనులు, స్వాతంత్ర్య సమరయోధులు ప్రాణత్యాగం చేశారని, వారి త్యాగాలతోనే స్వాతంత్ర్యం సిద్ధించిందని, వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్ ఝా పేర్కొన్నారు. శుక్రవారం కమిషనరేట్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయుధ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన సీపీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దేశాన్ని అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్దులు కావాలన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత దేశం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. పోలీసులు జాతి సమగ్రత, శాంతి, సమాజ స్థాపనకు దృఢ నిశ్చయంతో, నీతి నిజాయితీతో పని చేయాలన్నారు. పోలీసులు ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందించారు. గోదావరిఖని ఏసీపీ రమేష్, ఎస్‌బీ ఏసీపీ మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏఓ శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జెండా వందనం చేస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా, పోలీస్ అధికారులు

ప్లాంట్ రామగుండంలో...
కార్యాలయం నోయిడాలో...
● ఆర్ఎఫ్‌సీఎల్ కేంద్ర కార్యాలయాన్ని రామగుండానికి తరలించాలని ఎంపీల లేఖ
7

ఉద్యోగులు, అధికారుల సహకారంతో సింగరేణి అభివృద్ధి



మాట్లాడుతున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): భారతీయులంతా ఐకమ త్యంగా కలిసిమెలిసి ఉండాలని ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ పిలుపు నిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం జీఎం కాలనీ మైదానంలో జెండావిష్కరణ చేశారు. సింగరేణి ఎస్అండ్ పీసీ సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడు తూ కుల, మత, జాతి బేదాలు లేకుండా భారతీయులంతా ఒకటే అనే సిద్ధాంతంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సింగరేణి నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను చేధించడంలో ఉద్యోగులు, అధికారుల పాత్ర కీలకమని, ప్రతి ఉద్యోగి రక్షణతో కూడిన లక్ష్యాలను సాధిస్తూ పని స్థలాల్లో అంకితభావంతో పని చేసినప్పుడే దేశ ప్రగతిలో మన వంతు కర్తవ్యాన్ని చాటుకుంటామన్నారు. సంస్థ ఉద్యోగుల సంక్షేమా నికి పెద్దపీట వేస్తుందని, కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలను మెరుగు పర్చడంతోపాటు సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. ఉత్తమ ఉద్యో గులను సన్మానించారు. అనంతరం సింగరేణి హైస్కూల్, సెక్రెడ్ హార్ట్, సెయింట్ పాల్, శ్రీరామ, ఉషోదయ, జెడ్పీ హైస్కూల్, వివేకా నంద పాఠశాలల విద్యార్థులు నృత్యాలు ఆకట్టుకున్నాయి. జీఎం (క్వాలిటీ)బైద్య, సీఎంఓఏఐ నాయకులు మల్లేషం, ఇన్‌చార్జి ఎస్ఓటూ జీఎం రమేష్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, ఏరియా ఇంజనీర్ రమేష్, ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్, 11గ్రూప్ ఏజెంట్ చిలుక శ్రీనివాస్, డీజీఎంలు జితేందర్‌సింగ్, కరుణ, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, సాంబశివరావు, రాజు, వసంతకుమార్, వేణు, శ్రావణ్‌కు మార్, హనుమంతరావు, ఏఐటీయూసీ నాయకుల పోషం పాల్గొన్నారు.

అవసరం మేరకే యూరియా కొనుగోలు చేయాలి

పెద్దపల్లి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): అవసరం మేరకే రైతులు యూరియా కొనుగోలు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో యూరియా పంపిణీ పై వ్యవసాయ అధికారులతో నిర్వహించిన సమావేశం లో ఆయన మాట్లాడారు. ప్రస్తుత అవసరం మేరకు మాత్రమే రైతులు యూరియా కొనుగోలు చేయాలని, ఈ అంశాన్ని మండల వ్యవసాయ అధికా రులు, వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, ఎట్టి పరిస్థితుల్లో యూరియాను ముందస్తుగా కొనుగోలు చేసి నిల్వ చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందవద్దని వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామాల పర్యటన సందర్భంగా రైతులకు తెలియజేయాలన్నారు. ఒకే వ్యక్తి తరచుగా యూరియా కొనే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలి పారు. గ్రామాలలో ఇప్పటివరకు యూరియా అందని రైతుల వివరాలు సేక రించి వారికి యూరియా అందేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో కొందరు డీలర్లు వారి బంధుమిత్రులకు యూరియాను ఎక్కువ మొత్తంలో అమ్ముతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, యూరియా విక్రయాలలో అక్ర మాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వ్యవసాయ అధికారి బి శ్రీనివాస్, ఏడీఏ కాంతారావు, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని ఒకరి బలవన్మరణం


సంతోష్(ఫైల్)

తిమ్మాపూర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్లపల్లి గ్రామానికి చెందిన గోసగొని సంతోష్(29) గురువారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్‌కు 6సంత్సరాల క్రితం సైదాపూర్ మండలం అంబనికుర్తి గ్రామానికి చెందిన మమతతో వివాహం జరిగింది. భార్య, భర్తల మధ్య గొడవలతో 25రోజుల క్రితం మమత తనతల్లి గారింటింకి వెళ్లింది. సంతోష్ ఆటోడ్రైవర్‌గా పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆటో కోసం ఫైనాన్స్‌లో లోన్ తీసుకొని సరిగా నడపక అప్పులు తీర్చలేదు. ఈక్రమంలో ఈనెల 14వతేది గురువారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన సంతోష్ రాత్రి 11.30గంటల తరువాత ఇంటికి చేరుకొని తన గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. అతని అక్క రజిత అన్నం తినడానికి పిలిచేందుకు తలు పులు తట్టగా, తలుపులు తీయకపోవడంతో కిచెన్ కిటికి లోంచి చూసింది. సంతోష్ గదిలో ఫైపుకి చీరతో ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించాడు. వెంటనే స్థానికుల సాయంతో తలుపులు పగలగొట్టి ఉరి వేసుకొన్న సంతోష్‌ను కిందికి దింపారు. అప్పటికే సంతోష్ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కాంట్రాక్టు కార్మికుడి మృతి


మల్లేష్(ఫైల్)

జ్యోతినగర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పర్మినెంటు టౌన్‌షిప్‌లో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మేకల మల్లేష్(50) అనే కాంట్రాక్టు కార్మికుడు మృతిచెందాడు. మల్లేష్ తోటి కార్మికుడితో కలిసి మోపెడ్‌పై వెళుతుండగా ఎదురుగా వేగంగా బైక్‌పై వచ్చిన బొద్దున సంజయ్ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో మల్లేష్ తలకు బలమైన గాయం కావడంతో గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి, అనంతరం కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మేకల మల్లేష్ చనిపోయాడు. మృతుడి కొడుకు మేకల వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు.

వ్యవసాయ బావిలో పడి మహిళా రైతు మృతి


లక్ష్మి(ఫైల్)

మల్యాల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంట నష్టపరుస్తున్న పక్షులను తరుమబోయిన ఓ మహిళా రైతు ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలోపడి శుక్రవారం మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. మల్యాల మండలం ముత్యంపేటకు చెందిన సామ అంజిరెడ్డి అనే రైతుభార్య లక్ష్మి(44) తమ వ్యవసాయభూమిలో సాగు చేసిన మొక్కజొన్న పంట వద్దకు నిత్యం వచ్చే కోతులు, పక్షుల నుంచి పంటను కాపాడుకోవడానికి కాపలాగ ఉంటున్నారు. శుక్రవారం భర్త అంజిరెడ్డి మొక్కజొన్న పంట వద్దకు రావడంతో లక్ష్మి ఇంటికి వెళ్తోంది. ఈక్రమంలో పక్షులను తరుముకుంటూ వెలుతుండగా ప్రమాదవశాత్తూ లక్ష్మి కాలు బావిలోకి జారడంతో అందులో పడి మృతి చెందింది. మృతదేహాన్ని బావిలో నుంచి తీసి పోస్టుమార్టం కోసం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి భర్త, కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు ఇటీవల అమెరికా నుంచి రాగా మళ్లీ వెళ్లడానికి ప్రయత్నాలు చేస్తుండగానే ఈ సంఘటన చోటు చేసుకోవడం ఆ కుటుంబంలో విషాదం నింపింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి

ఇల్లంతకుంట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దాచారం గ్రామానికి చెందిన కరికవేని లక్ష్మి(35) అనే వివాహిత విద్యుదాఘాతంలో మృతిచెందినట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఇంటిలో విద్యుత్ స్విచ్‌బోర్డుకు ప్లగ్ పెడుతుండగా షాక్‌కు తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలికి భర్త రాజు, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతురాలి తల్లి కనుకవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాట్సాప్ వ్యవసాయం



● వాట్సాప్ ఛానల్‌కు ప్రభుత్వం శ్రీకారం
● రైతులకు సమాచారం చేరవేత
● పంటల సంరక్షణ, సబ్సిడీలు తెలుసుకునే అవకాశం

చొప్పదండి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో నూతన విప్లవానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ శ్రీకారం చుట్టింది. రైతులను నేరుగా కలిసే అవసరం లేకుండా వాట్సాప్ ద్వారా సమాచారం అనుసంధానం చేయడానికి కొత్తగా ఛానల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వాట్సాప్ ఛానల్ ద్వారా వ్యవసాయ శాఖ ఎప్పటికప్పుడు సమాచారాన్ని రైతులకు చేరవేసేందుకు ఎంతగానో ఉపయోగపడుతుంది. పంటల సంరక్షణ , సలహాలు, సూచనలతో పాటు ప్రభుత్వ పథకాలను, సబ్సిడీలను, వాతావరణ సూచనలను రైతులకు ఈ ఛానల్ ద్వారా ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ అందజేస్తుంది. గతంలో రైతులు సాగులో ఏర్పడే సమస్యలకు అధికారుల వద్దకు వెళ్లాల్సి వస్తుండేది. వాట్సాప్ ఛానల్ ద్వారా వరి,పత్తి, మొక్కజొన్నతో పటు ఇతర పంటల సమస్యలను వ్యవసాయ శాఖ ఎప్పటికప్పుడు, కొన్ని సందర్భాలలో ముందస్తుగా సూచనలు అందజేస్తుంది. భారీ వర్షాలతో పంటల్లో చేపట్టాల్సిన చర్యలు,పంటలను కాపాడుకునేందుకు తీసుకునే జాగ్రత్తల గురించి వ్యవసాయ శాఖ చానెల్ ద్వారా రైతులకు అందజేస్తుంది.

అర చేతిలోనే సాగు సమాచారం

రైతుల సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం వారం క్రితం వాట్సాప్ ఛానల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. రైతులు తాము ఉన్న చోటు నుంచే సాగుకు అవసరమైన సలహాలు, సూచనలను వ్యవసాయ శాఖ నుంచి పొందవచ్చు. ఆండ్రాయిడ్ మొబైల్ కలిగిన ప్రతి రైతు ఈ ఛానల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకోవచ్చు. ఛానల్‌పై వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తుండగా, విత్తన దశ నుంచి పంట కోసే వరకు రైతు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఛానల్ ద్వారా తెలుసుకోవచ్చు.

ప్రభుత్వ పథకాలు, సబ్సిడీ వివరాలు కూడా ఛానల్ ద్వారా రైతులకు అందజేస్తుంటారు. మార్కెట్‌కు సంబంధించిన ధరలను విత్తనాలు వివరాలు కూడా ఛానల్ ద్వారా తెలుసుకోవచ్చు. వాట్సాప్ ఛానల్ ద్వారా వ్యవసాయ రంగంలో నూతన శకం మొదలైంది. రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు అధికారుల వద్దకు వెళ్లాల్సిన పనిలేకుండా వాట్సాప్ ఛానల్‌లో అన్ని వివరాలను సూచనలను పొందే అవకాశం ఏర్పడింది.

రైతులు ఛానల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకోవాలి

వంశీకృష్ణ, వ్యవసాయ అధికారి, చొప్పదండి



రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అధికారిక వాట్సాప్ ఛానల్‌ను రైతులందరూ వినియోగించుకోవాలి. రైతులు తమ కార్యాలయంలో గానీ తమను నేరుగా కలిసి వాట్సాప్ ఛానల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకోవచ్చు. రైతులకు శాస్త్రవేత్తల సూచనలు సలహాలు అందుతుంటాయి. రైతులు వెంటనే ఛానల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకోవాలి.

భూకబ్జా కేసులో మాజీ వీఆర్ఏ అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): భూకబ్జా కేసులో సిరిసిల్ల పట్టణం చిన్నబోనాలకు చెందిన మేడుదుల మొండయ్య అనే మాజీ వీఆర్ఏ, ప్రస్తుతం నీటి పారుదల శాఖ లష్కర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్ద బోనాల శివారులో సర్వే నంబర్ 155లోని 2ఎకరాల భూమి రెవెన్యూ రికార్డులలోకి ఎక్కించుకొని పాస్ బుక్ పొందాడు. గతంలో వీఆర్ఏ పనిచేసిన మొండయ్య అధికారులను తప్పు దోవ పట్టించి పాస్‌బుక్ పొంది మోసం చేశాడు. ఆన్‌లైన్‌లో తన పేరు ఉండడంతో కాళేశ్వరం ప్రాజెక్టు 9వ ప్యాకేజీ కింద కొంత భూసేకరణలో అతడికి డబ్బులు కూడా వచ్చాయి. ఈ భూమి తమదని, 2 ఎకరాల భూమిని అక్రమంగా పట్టా పొందాడని భూయజమానురాలు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా కోర్టు మహిళకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ మేరకు కోర్టు సూచన ప్రకారం కలెక్టర్ ఆదేశాలతో సిరిసిల్ల తహసీల్దార్ ఫిర్యాదుపై మొండయ్య అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

కుక్క దాడిలో వ్యక్తికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో శుక్రవారం కుక్క దాడి చేయడంతో వ్యక్తి లింగమ్మగారి భాస్కర్ తీవ్ర గాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి తరలించారు. గ్రామంలో ఇస్త్రీ డబ్బాను నిర్వహిస్తున్న భాస్కర్ ఇంటి నుంచి టీలా వద్దకు వస్తున్న క్రమంలో కుక్క ఒక్కసారిగా దాడికి దిగింది. కాలు, తలపై గాయాలయ్యాయి. ఇటీవల గ్రామంలో కుక్కల బెడద తీవ్రమైందని ప్రజలు పేర్కొంటున్నారు.

ముగ్గురు దొంగల అరెస్టు


పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు నగలు

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కిన పడాల స్రవంతి బ్యాగులో నుంచి చోరీచేసిన ముగ్గురు దొంగలను అరెస్ట్ చేశామని టౌన్‌సీఐ కృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గురువారం సాయంత్రం నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన పడాల స్రవంతి సిరిసిల్లకి పెళ్లికివచ్చి తిరిగి వెళ్లేందుకు సిరిసిల్ల పాత బస్టాండ్‌కు వచ్చి బస్సు ఎక్కింది. తర్వాత హ్యాండ్ బ్యాగ్ చుసుకోగా జిప్ తెరిచి ఉండి అందులో పెట్టుకొన్న బంగారు నగలు గల ప్లాస్టిక్ బాక్స్ కనిపించటం లేదు. అందులో 14తులాల బంగారు నగలు ఉన్నాయని, బస్సు ఎక్కే సమయంలో దొంగలు ఎత్తుకుపోయారని ఫిర్యాదు చేసింది. పోలీసలు కేసునమోదు చేసుకొని సీసీ కెమెరాల సహాయంతో 24గంటల్లో నిందితులను గుర్తించి పట్టుకొని వారి వద్ద నుంచి 14 తులాల బంగారు నగలను స్వాధీనపరుచుకున్నారు. చోరీచేసిన వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్ల గ్రామానికిచెందిన పల్లపు ఆంజనేయులు(32), వేములవాడ పట్టణంలోని సాయినగర్ కాలనీకి చెందిన సంకెపల్లి రాజేశ్వరి(30), వేములవాడ పట్టణం విద్యానగర్‌కు చెందిన డొక్కా బాలవ్వ(32)ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామని సీఐ కృష్ణ తెలిపారు. వీరి వద్ద నుంచి 14తులాల బంగారు ఆభరణాలు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు.

రైలు కింద పడి యువకుడి బలవన్మరణం


రాజు(ఫైల్)

ఓదెల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఐలు రాజు(41) శుక్రవారం పొత్కపల్లి రైల్వేస్టేషన్‌కు కొంత దూరంలో ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైల్ కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామగుండం జీఆర్‌పి హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపినవివరాలు ఈవిధంగా ఉన్నాయి. రాజు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. అనారోగ్యాన్ని భరించలేక జీవితంపై విరక్తితో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నలుగురిపై కేసు నమోదు

బోయినపల్లి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): యువకుడిపై దాడి చేసిన ముగ్గురితో పాటు దాడికి ప్రోత్సహించిన మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రాజయ్య తెలిపారు. గతనెల 28వ తేదిన కొదురుపాక గ్రామానికి చెందిన చెన్నమనేని కొండల్‌రావుపై ఇదే గ్రామానికి చెందిన జోగినపల్లి వెంకటరావ్ ప్రోద్భలంతో బాలగోని వెంకటేష్, సిద్ధాంతి దీక్షిత్, సిద్ధాంతి కళాధర్‌లు దాడిచేసినట్లు తెలిపారు. బాధితుడు కొండల్‌రావ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేయకపోవడంతో ఎస్పీ మహేష్ బి గితేను ఆశ్రయించాడు. ఈ మేరకు విచారణ జరిపి కేసు నమోదు చేయాలని ఎస్పీ ఆదేశాల మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

దొంగతనం కేసుల్లో ఒకరి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడుతూ దప్పించుకు తిరుగుతున్న తీగలగుట్టపల్లికి చెందిన షేక్ సల్మాన్(29)ను శుక్రవారం అరెస్టుచేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. తీగలగుట్టపల్లి, మందులపల్లి, ముగ్దుంపూర్‌లో పలు దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందని పేర్కొన్నారు. దొంగిలించిన బైక్‌ను కరీంనగర్‌లో విక్రయించేందుకు వస్తున్న క్రమంలో నిందితుడిని పట్టుకున్నామని తెలిపారు.

స్వాతంత్ర్య దినోత్సవం రోజున మద్యం విక్రయం

● రూ.32,960 విలువైన మద్యం స్వాధీనం
● ముగ్గురిపై కేసు నమోదు

తిమ్మాపూర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం రోజున అలుగునూర్‌లో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారంతో ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు రైడ్‌చేశారు. కొద్ది రోజులుగా కిరాణా దుకాణాల్లో ఇష్టారీతిలో అర్ధరాత్రి వరకు మద్యం విక్రయిస్తున్నారని సమాచారంతోనే దాడుల చేసినట్లు ఎస్సై తెలిపారు. మద్యం విక్రయిస్తున్న అలుగునూర్‌కి చెందిన ముంజ మంజయ్య, ముంజ లక్ష్మణ్, బుర్ర లక్ష్మణ్ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 32,960రూపాయల విలువగల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

చిరుత దాడిలో లేగ దూడ మృతి

కోనరావుపేట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం గోవిందరావుపేట తండాలో చిరుత దాడిలో లేగదూడ మృతి చెందింది. గోవిందరావుపేట తండాకు చెందిన గుగులోతు పరుశురాములు అనే రైతుపొలం దగ్గర లేగదూడను కట్టేసి ఇంటికివచ్చాడు. శుక్రవారం తెల్లవారు జామున పొలం వద్దకు వెళ్లి చూసేసరికి లేగ దూడ మృతిచెంది కనిపించింది. ఈ విషయమై అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా అధికారులు చేరుకొని చిరుత దాడిలో మృతి చెందినట్లు గుర్తించారు.

మేడిపల్లిలో గంజాయి మొక్కలు

● పోలీసుల అదుపులో నిందితుడు


గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుంటున్న ఎస్సై ఉదయ్‌కిరణ్

జ్యోతినగర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మేడిపల్లి గ్రామంలో శుక్రవారం నాలుగు గంజాయి మొక్కలను ఎస్ఐ ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు గుర్తించారు. ఒక ఇంటి సమీపంలోని ఖాళీ స్థలంలో గంజాయి మొక్కలున్నట్లు ఎన్టీపీసీ పోలీసులకు సమాచారం అందింది. అక్కడికి వెళ్లి గంజాయి మొక్కలను ఎస్ఐ స్వాధీనం చేసుకున్నారు. కార్తిక్ అనే యువకుడిని అదుపులోకి తీసుకొని పోలీసులు విచారిస్తున్నారు. గ్రామంలో మరెక్కడైనా గంజాయి మొక్కలను పెంచుతున్నారనే విషయంలో తనిఖీలు చేస్తామని ఎస్ఐ చెప్పారు.

కుల బహిష్కరణ చేసిన ఐదుగురిపై కేసు నమోదు

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణానికి చెందిన దుగ్గి బుచ్చయ్య అనే వ్యక్తిని కుల బహిష్కరణ చేసిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గాజులపేటకు చెందిన దుగ్గి బుచ్చయ్య మున్నూరు కాపు సంఘంలో గత 40 సంవత్సరాలుగా సభ్యుడిగా ఉంటున్నాడు. కాగా అదే కులానికి చెందిన గోనెల రాజరెడ్డి, గోనెల శేఖర్, గోనెల రమేష్, గోనెల లక్ష్మణ్, గోనెల చిన్న లింగం అనే వ్యక్తులు అకారణంగా బుచ్చయ్యను కులం నుంచి బహిష్కరించడంతో పాటు అతని ఇంటికి వెళ్లిన, అతని కుటుంబసభ్యులతో మాట్లాడినా రూ.2లక్షల జరిమానా విధిస్తామని బెదిరిస్తూ సంఘంలో కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని బుచ్చయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్ పేర్కొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● బంగారం, వెండి ఆభరణాల అపహరణ

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చైతన్యనగర్‌లో ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మెట్‌పల్లి పట్టణానికి చెందిన గంప అర్చన రాఖీ పౌర్ణమి సందర్భంగా పట్టణ ప్రధాన రహదారిలోని తన తమ్ముడు సామ అమర్నాథ్ ఇంటికి వారం రోజుల క్రితం వెళ్లి తిరిగి శుక్రవారం ఇంటికి వచ్చింది. ఇంటి తాళం పగలగొట్టి ఇంటి లోపల ఉన్న బీరువాను ధ్వంసం చేసి తులం పావు బంగారు చైను, అర తులం చేతి రింగు, తులం చెవి కమ్మలు, 20 తులాల వెండి సామాను చోరీ చేశారని ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. సంఘటన స్థలాన్ని శుక్రవారం పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు. అర్చన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

భర్తను పోషించలేక వివాహిత ఆత్మహత్య

ధర్మపురి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోదావరి నదిలో దూకి జవ్వాజి పద్మ(54) అనేవివాహిత శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. జవ్వాజి పద్మకు బాపు అనే వ్యక్తితో వివాహం జరిగింది. కొన్నేళ్ల నుంచి బాపుకు కళ్లు కనిపించకపోవడం వల్ల ఎలాంటి పనులు చేయకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. అప్పటినుంచి పద్మ చిన్నచిన్న వ్యాపారం చేసుకుంటూ తన భర్త బాపును పోషించుకుంటోంది. కొన్నిరోజుల నుంచి బాపు ఆరోగ్యం క్షీణించడం వల్ల మంచానికే పరిమితం అయ్యాడు. భర్తను పోషించలేక తీవ్ర మనస్తాపానికి గురైన పద్మ ఉదయం గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు పద్మ మేనల్లుడు నరేందుల నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి యువకుడి మృతి

● మరో ఇద్దరికి గాయాలు

కొడిమ్యాల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని తురుక కాశీనగర్ రైల్వేట్రాక్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున ద్విచక్రవాహనం అదుపు తప్పి ఉదయ్‌కిరణ్(22) అనేయువకుడు మృతిచెందగా, ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. ఎస్సై ఎస్ సందీప్ తెలిపిన వివరాల మేరకు.. మల్యాల మండలం ఒబులాపూర్ గ్రామానికి చెందిన కుసుమ ఉదయకిరణ్, కరీంనగర్ పట్టణానికి చెందిన దిమ్మగల విశాల్, పెద్దపెల్లి మండలం నిట్టూరుకు చెందిన జోగుల వెంకటేష్ ముగ్గురు స్నేహితులు. వీరు ద్విచక్రవాహనంపై మల్యాల నుంచి కరీంనగర్ వెళ్తున్నారు. కొడిమ్యాల మండలంలోని తురుకకాశీనగర్ రైల్వే ట్రాక్ వద్ద అదుపు తప్పి కింద పడగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వాహనం నడుపుతున్న ఉదయ్‌కిరణ్ ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందాడు. గాయపడిన విశాల్ తల్లి దిమ్మగల వాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను తర లిస్తున్న ట్రాక్టర్లను శుక్రవారం పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్‌ల డ్రైవర్లు మధుకర్, హరీష్, అనిల్‌పై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

పింఛన్ డబ్బులిస్తేనే.. ఇంటికి

● తల్లిని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వదిలేసిన కొడుకు


తాడికల్‌లో గ్రామపంచాయతీ వద్ద కూర్చున్న వెంగళ లచ్చవ్వ

శంకరపట్నం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): తల్లి పింఛన్ డబ్బుల కోసం కొడుకుల మధ్య కొట్లాట ఆ తల్లిని గ్రామపంచాయతీ వద్ద వదిలేసే పరిస్థితికి తెచ్చింది. తల్లి బాధ్యతలు దేవుడెరుగు కానీ తల్లికి వచ్చేడబ్బులు మాత్రం కావాలి అన్నచందంగా కొడుకుల పరిస్థితి ఉంది. శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన వెంగళ లచ్చవ్వ అనే వృద్ధురాలిని పెద్ద కొడుకు పింఛన్ డబ్బుల కోసం గ్రామపంచాయతీ వద్ద వదిలివెళ్లాడు. వివరాల్లోకి వెళ్లితే.. వెంగళ లచ్చవ్వ భర్తగతంలోనే మృతిచెందాడు. అప్పటి నుంచి ముగ్గురు కొడుకులు పెద్ద కొడుకు రాజకొంరయ్య, నడిపి కొడుకు రాజయ్య, చిన్న కొడుకు సమ్మయ్య దగ్గర ఉంటోంది. వీరు ముగ్గురు తల్లిని వంతుల వారీగా పోషిస్తున్నారు. శుక్రవారం నడిపి కొడుకు రాజయ్య వంతు పూర్తి కాగానే తల్లిని తన అన్న రాజకొంరయ్య ఇంటి వద్ద వదిలిపెట్టాడు. రాజకొంరయ్య, తల్లి నెలనెలా పింఛన్ డబ్బులు లెక్క తేలేవరకు తల్లి బాధ్యతలు తనకు అవసరం లేదంటూ ఆమెను తీసుకెళ్లి గ్రామపంచాయతీ వద్ద వదిలివెళ్లాడు. అంతేకాక పింఛన్ డబ్బుల కోసం రెండో కొడుకు రాజయ్య తల్లిని గాయపరచాడన్నారు. చిన్న కొడుకు సమ్మయ్య పింఛన్ డబ్బులతో మందులు తెస్తున్నాడని తల్లి చెప్పింది. తను కూడా మందులు తెస్తున్నానని, తన దగ్గర మందులు తెచ్చిన బిల్లులు ఉన్నాయని పెద్దకొడుకు అన్నారు. పింఛన్ డబ్బుల సమస్య పరిష్కారమయ్యే వరకు తాను తీసుకెళ్లనని పెద్దకొడుకు చెప్పాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో తల్లిని పెద్దకొడుకు రాజకొంరయ్య ఇంటికి తీసుకెళ్లాడు.

గల్ఫ్‌లో ఎండపల్లి వాసి కష్టాలు

● ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబీకుల వేడుకోలు

ఎండపల్లి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లిన ఎండపల్లి మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి కష్టాలు పడుతున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎండపల్లి గ్రామానికి చెందిన మంతెన కిరణ్ ఐదునెలలక్రితం దుబాయి వెళ్లాడు. మూడు నెలలు ఇంటికి జీతం సరిగానే పంపాడు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా దుబాయ్‌లో పనినుంచి తీసివేయడంతో రెండు నెలలుగా పని లేకపోవడంతో ఇక్కడ బతకడం కష్టంగా ఉందని కిరణ్ ఇంటికి ఫోన్ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి కిరణ్ గ్రామానికి వచ్చేలా చూడాలని కుటుంబీకులు వేడుకుంటున్నారు.

పోలీసు పహారా మధ్య యూరియా పంపిణీ


దేవంపల్లిలో యూరియా కోసం గుమిగూడిన రైతులు

మానకొండూర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవంపల్లి సహకార సంఘం పరిధిలోని దేవంపల్లి, పచ్చునూర్ గ్రామాల్లో సింగిల్ విండో గోదాంల వద్ద శుక్రవారం యూరియా కోసం రైతులు పడిగాపులు కాశారు. దేవంపల్లికి 220, పచ్చునూర్‌కు 220 యూరియా బస్తాల లోడ్ వచ్చింది. రైతులు ఒక్కసారిగా గోదాంల వద్దకు చేరుకున్నారు. గంటల తరబడి క్యూలో నిలబడ్డ రైతులకు యూరియా పంపిణీ చేయకపోవడంతో రైతులు పెద్ద ఎత్తున కేకలు వేశారు. దీంతో నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందిండంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు రైతులను అదుపు చేశారు. ఒక్కొక్క రైతుకు రెండేసి బస్తాల చొప్పున పంపిణీ చేయడంతో చేసేది లేక నిరుత్సాహంగా వెళ్లిపోయారు.

గాగిరెడ్డిపల్లిలో భూవివాదం: ఇరువర్గాల ఘర్షణ

చిగురుమామిడి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాగిరెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి భూవివాదంలో ఇరువర్గాలకు చెందిన వ్యక్తులు తీవ్ర ఘర్షణకు పాల్పడ్డారు. ఈ విషయంపై గ్రామానికి వచ్చిన పోలీసులను అడ్డుకున్నారు. తాము 20రోజుల నుంచి ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని పోలీసుల తీరుపై తీవ్ర ఆరోపణలు చేశారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. గాగిరెడ్డిపల్లిలో హైదారాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి భూమి కొనుగోలు చేశాడు. ఈ భూమి పక్కన కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తి భూమి కొనుగోలు చేశాడు. అప్పటి నుంచి ఇద్దరి మధ్య 20 గుంటల భూమి విషయమై గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి ఇద్దరు వ్యక్తుల భూములు కౌలు చేస్తున్న వ్యక్తులు ఘర్షణకు దిగారు.

ఈ ఘర్షణలో గ్రామస్థుడు కల్వల రాజేశ్వర్‌రెడ్డికి దెబ్బలు తగిలి స్పృహ కోల్పోయాడు. గ్రామానికి చెందిన సింగిరెడ్డి తిరుపతి రెడ్డికి చెందిన పొట్ట దశలో ఉన్న రెండెకరాల వరి పొలాన్ని హైదరాబాద్‌కి చెందిన వ్యక్తి ట్రాక్టర్‌తో దున్నాడు. బాధితులు ఇద్దరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సైని సంప్రదించగా తమకు ఫిర్యాదు ఇస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు.



నేడు కృష్ణాష్టమి

పలు ఆలయాల్లో వేడుకలు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : పరమాత్మ స్వరూపమైన శ్రీకృష్ణుని జన్మదినాన్ని కృష్ణాష్టమిగా శైవ సంప్రదాయంలో అష్టమి తిథి ప్రకారం శనివారం జరుపుకోనున్నారు. పండుగ సందర్భంగా ఇంటిలో కృష్ణుని పాద ముద్రలను వేసుకోవాలి. విష్ణు సంబంధ స్తోత్రాలతో అభిషేక, అర్చనలు చేయాలి. ఉపవాసం పాటించాలి. కృష్ణున్ని ఊరేగించి, ఊయలలో వేసి పాటలు, పద్యాలు, స్తోత్రాలు చదువుతూ పూజించాలి. పాలు, వెన్న, పండ్లు, అటుకులు నైవేద్యంగా సమర్పించి ఉట్టి వేడుకలను నిర్వహించాలి. రాత్రి జాగరణ పాటిస్తే పాపాలు నశిస్తాయని అగ్ని పురాణం చెపుతుంది. కృష్ణుని పూజించి భాగవత గ్రంధాన్ని పఠిస్తే, దానాలు చేస్తే పాపాలు తొలగుతాయని స్కంద పురాణం చెబుతుంది. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఆలయాలు ముస్తాబయ్యాయి. సాయినగర్ మురళీకృష్ణ, అశోక్‌నగర్ మళయాళ సద్గురు గీతామందిరాలతో పాటు నగరంలోని పలు ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు.



గీతామందిరంలో కొలువుదీరిన కృష్ణుడు

మెట్ట ప్రాంతాల్లో ముమ్మరంగా వరి నాట్లు

వర్షాలతో ఊపిరి పీల్చుకున్న రైతులు

హుజూరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో మెట్ట ప్రాంతంలోని రైతులు ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు. మొన్నటి వరకు పోసిన నారు ముదిరి పోతున్నా.. నీళ్ల చుక్క లేక నాట్లు వేయకుండా పొలాలను వదిలేశారు. వారం రోజుల క్రితం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటి వరకు చెరువు, కుంటల్లోకి 50 శాతం నీళ్లు వచ్చాయి. దీంతో రైతులు పొలాలన్నీ దున్ని నాట్లు వేస్తున్నారు. డివిజన్‌లో హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లం దకుంట, వీణవంక, సైదాపూర్, శంకరపట్నం మండలాలు ఉండగా, 1.2 లక్షల ఎకరాల్లో సాగుభూమి ఉంది. ఇందులో 80 వేల ఎకరాల్లో వరి, 20 వేల ఎకరాల్లో పత్తి, 20 వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేస్తున్నారు. ఎస్సారెస్పీ ఆయకట్టు కింద భూగర్భజలాలు ఉండడంతో ఆ ప్రాంత రైతులు నెల క్రితమే నాట్లు వేశారు. మెట్ట ప్రాంతంలో మాత్రం నీళ్లు లేకపోవడంతో నాట్లు వేయలేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.



హుజూరాబాద్ మండలం కాట్రపల్లిలో నాటేస్తున్న మహిళలు

శ్రీపాద ఎల్లంపల్లికి కొనసాగుతున్న వరద

పెద్దపల్లి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి 3,554 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలకుగాను, 15,731 టీఎంసీల నీళ్లు చేరాయి. ఇక్కడి నుంచి నంది పంప్‌హౌస్‌కు 9,450 క్యూసెక్కులు, ఇతర అవసరాలకు 451 క్యూసెక్కుల నీటిని వదిలి పెడుతున్నారు. ఎగువ ప్రాంతాన వర్షాలు లేకపోవడంతో వరద తగ్గుముఖం పట్టింది. వస్తున్న వరద నీరంతా కడెం ప్రాజెక్టు నుంచే వస్తున్నాయి.

చేప పిల్లలకు బదులు నగదు పంపిణీ చేయాలి

ముఖ్యమంత్రికి మాజీ మంత్రి జీవన్‌రెడ్డి లేఖ

జగిత్యాల అర్బన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మత్స్యకారులకు చేప పిల్లలకు బదులు నగదు పంపిణీ చేయాలని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుక్రవారం లేఖ రాశారు. చేప పిల్లలను సమకూర్చేందుకు జూలైలో టెండర్లు పిలువగా కాంట్రాక్టర్లందరూ రింగ్ కావడంతో టెండర్‌ను వాయిదా వేశారన్నారు. మళ్ళీ శుక్రవారం టెండర్ ప్రకటన వెలువడిందన్నారు. చేపపిల్లల పంపిణీకి సంబంధించి ఇప్పటికే జాప్యం జరిగిందన్నారు. రాష్ట్రప్రభుత్వం చేప పిల్లల పంపిణీకి బదులు వాటి విలువకు అనుగుణంగా చెరువుల విస్తీర్ణాన్ని బట్టి నగదు బదిలీ చేయాలని కోరారు. దీంతో దళారుల ప్రమేయం తొలిగిపోవడంతో పాటు మత్స్యశాఖ సొసైటీలు ఆశించిన ఫలితం ఉంటుందని ముఖ్యమంత్రికి రాసిన లేఖలో జీవన్‌రెడ్డి వివరించారు.

ప్లాంట్ రామగుండంలో.. కార్యాలయం నోయిడాలో..

ఆర్‌ఎఫ్‌సీఎల్ కేంద్ర కార్యాలయాన్ని రామగుండానికి తరలించాలని ఎంపీల లేఖ

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో వరుస సాంకేతిక వైఫల్యాలతో ఉత్పత్తికి విఘాతం...

నిర్ణయాలు, ఆమోదాలలో జాప్యం



రామగుండంలోని ఆర్‌ఎఫ్‌సీఎల్ ముఖద్వారం

కోల్‌సిటీ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్‌సీఎల్)లో సాంకేతిక అవరోధాలతో వరుసగా యూరియా ఉత్పత్తి నిలిచి పోతుంది. రాష్ట్రంలో యూరియా కొరత వేళ ఉత్పత్తి నిలిచిపోతుండడంతో కేంద్ర ప్రభుత్వంతో పాటు పరిశ్రమలో భాగస్వామిగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం అసంతృప్తికి లోనవుతుంది. ఆర్‌ఎఫ్ సీఎల్ సంస్థకు దేశ వ్యాప్తంగా కేవలం రామగుండంలోనే పరిశ్రమ ఉన్నది. అయితే సంస్థ కార్పొరేట్ కార్యాలయం ఢిల్లీ సమీపంలోని నోయిడాలో ఉన్నది. కార్పొరేట్ కార్యాలయానికి, ప్లాంట్‌కు మధ్య సమన్వయ లోపంతో రాష్ట్రానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర ఎరువులు, రసాయనాల మంత్రిత్వశాఖలో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, కాంగ్రెస్ ఎంపీ బలరాంనాయక్‌లు స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఉన్నారు. వీరు ఆర్‌ఎఫ్‌సీఎల్ కార్పొరేట్ కార్యాలయాన్ని నోయిడా నుంచి రామగుండంకు తరలించాలంటూ ఈనెల 12న కేంద్ర ఎరువులు, రసాయనాలశాఖ కార్యదర్శి రజత్ కుమార్ మిశ్రాకు లేఖలు రాశారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ కార్పొరేట్ కార్యాలయాన్ని వెంటనే రామగుండానికి తరలించాలని కోరారు. దేశంలో సింగిల్ యూనిట్‌గా ఉన్న అనేక సంస్థలు కార్పొరేట్ కార్యాలయాలను పరి శ్రమల వద్దే ఏర్పాటు చేసుకున్నాయి. దీంతో సంస్థకు చెందిన సీఈఓలు, డైరెక్టర్ (ఫైనాన్స్), హెచ్‌ఆర్ డైరెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు కార్పొరేట్ కార్యాల యంలోనే ఉంటారు.

ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా మూతబడిన ఎరువుల కర్మాగారాలను పునరుద్ధరించారు. ఎఫ్‌సీఐకి చెందిన ఒడిశాలోని తాల్చేర్ యూనిట్‌ను కూడా జాయింట్ వెంచర్‌లో పునరుద్ధరించారు. ఆ పరిశ్రమ సాంకేతిక ఇబ్బందులతో ఉత్పత్తికి విఘాతం కలిగిన పరిస్థితుల్లో ఢిల్లీలోని కార్పొరేట్ కార్యాలయాన్ని తాల్చేర్‌కు తరలించారు. దీంతో పరిస్థితులు మెరుగుపడ్డాయి. ప్రభుత్వరంగానికి చెందిన కేరళలోని ఫ్యాక్ట్ ఎరువుల కర్మాగారం కూడా కార్పొరేట్ కార్యాలయం కొచ్చిలోనే ఉన్నది. అలాగే మద్రాస్ ఫెర్టిలైజర్స్, రాష్ట్రీయ కెమికల్స్‌కు చెందిన కార్పొరేట్ కార్యాలయాలు కూడా పరిశ్రమల వద్దనే ఉన్నాయి.

మూతపడిన రామగుండం ఎరువుల కర్మాగారాన్ని నేషనల్ ఫెర్టిలైజర్స్ ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ఎఫ్‌సీఐ, డెన్మార్క్‌కు చెందిన హల్దర్ టాప్స్ భాగస్వామ్యంతో ఆర్‌ఎఫ్‌సీఎల్‌గా పునరుద్ధరించారు. ఏటా 12లక్షల టన్నుల యూరియా ఉత్పత్తి లక్ష్యంతో ప్రాజెక్టును నిర్మించారు. 2021 నుంచి ఈ ప్రాజెక్టులో ఉత్పత్తి ప్రారంభమైంది. ఇందులో తెలంగాణకే 45శాతం యూరియా సరఫరా చేసే విధంగా కేంద్రం ప్రణాళిక చేసింది. సాంకేతిక అవరోధాలతో ప్లాంట్ తరచూ షట్‌డౌన్ అయి ఉత్పత్తి నిలిచిపోతుంది.

ఈ ఏడాది మే 8 నుంచి జూన్ 15వరకు, జూలై 16 నుంచి ఆగస్టు 4వరకు ఉత్పత్తి నిలిచిపోయింది. మళ్లీ ఆగస్టు 14న అమ్మోనియా లీకేజీతో ప్లాంట్ షట్‌డౌన్ అయ్యింది. ఈ వరుస వైఫల్యాలతో తెలంగాణకు లక్ష టన్నులకుపైగా యూరియా సరఫరాకు ఆటంకం ఏర్పడింది. ఈ నెలలో 65 వేల టన్నులు సరఫరా జరుగాల్సి ఉంది. యూరియా కొరతతో రైతాంగం ఇబ్బందులు పడుతుంది. పరిశ్రమలో క్షేత్రస్థాయి ఇబ్బందులను పరిష్కరించడంలో, త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యంతోనే ఈ పరిస్థితి ఏర్పడుతుందనే విమర్శలున్నాయి. ఆర్‌ఎఫ్‌సీఎల్ కార్యాలయాన్ని రామగుండం తరలిస్తేనే సమస్య పరిష్కారం త్వరగా అవుతుందని పలువురు పేర్కొంటున్నారు.

రాజన్న క్షేత్రం భక్తజన సంద్రం

- శ్రావణ శుక్రవారం అమ్మవారికి మొక్కులు



వేములవాడ ఆలయ ఆవరణలో భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం శుక్రవారం భక్తజన సంద్రంగా మారింది. భక్తులు ఉదయాన్నే పవిత్రస్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రాజరాజేశ్వరి అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకు న్నారు. వాయినం ఇచ్చి పుచ్చుకుని తులసి పూజలో పాల్గొన్నారు. కోడె మొక్కులు చెల్లించుకున్న భక్తులు అనుబంధ ఆలయాల్లో కుంకుపూజలో పాల్గొన్నారు.

రాజన్నను దర్శించుకున్న దసరా సినిమా డైరెక్టర్..

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దసరా సినిమా డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ఆలయానికి తరలివచ్చిన ఆయన స్వామి వారిని దర్శించుకుని రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకున్నారు. శ్రీనాగిరెడ్డి మంటపంలో అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఆలయ సీనియర్ అసిస్టెంట్ బొడుసు మహేష్ రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.



సినీ డైరెక్టర్ శ్రీకాంత్‌కు ప్రసాదం అందజేస్తున్న బొడుసు మహేష్

యమధర్మరాజు ఆలయంలో అభిషేకం



ప్రత్యేక అలంకరణలో యమధర్మరాజు స్వామివారు

ధర్మపురి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ యమధర్మరాజు ఆలయంలో శుక్రవారం స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛ రణల మధ్య అర్చకులు నేరెళ్ల వంశీకృష్ణ, ఒద్ది పర్తి కళ్యాణ్ కుమార్ స్వామి వారికి రుద్రాభిషేకం, పురుషసూక్తం, లక్ష్మీ సూక్తం, మన్య సూక్తంతో అభిషేకం, ఆయుష్య హోమం, ప్రత్యేక పూజలు నిర్వ హించారు. రాత్రి వరకు భక్తులు గండ దీపంలో నూనె పోసి స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ధర్మకర్త రాపర్తి సాయి కిరణ్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్ కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మహిళల సామూహిక కుంకుమార్చన

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మి నరసింహస్వామి అనుబంధ రామ లింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో మహిళలు సామూహిక కుంకుమార్చన శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళలు లక్ష్మి అష్టోత్తరం, దుర్గా అష్టోత్తరంతో కుంకుమ పూజలు జరిపారు. శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో శుక్రవారం భక్త జన సందడి నెలకొంది. అనేక మంది భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. మహిళలు నదీ తీరాన గల ఆలయాల్లో ఉద్యాపన పూజలు, కుంకుమ పూజలు జరిపారు.



మహాలక్ష్మి దేవాలయంలో మహిళలు కుంకుమ పూజలు

తెలంగాణ వాటా వినియోగించుకుంటాం

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, పక్కన ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతుల ప్రయోజనాలకు సంబంధించి గోదావరి, కృష్ణా జలాల్లో మన వాటా చివరి నీటి బొట్టు వరకు వినియోగించుకుంటామని, కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకొచ్చే వరకు పోరాటం కొనసాగుతుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. కరీంనగర్‌లో స్వాతంత్ర వేడుకలకు హాజరైన అనంతరం మీడియాతో మాట్లాడారు. పక్కరాష్ట్రం ఏ పేరుతో, నీటిని ఉపయోగించుకున్నా, ఏ పేరుతో ప్రాజెక్టు నిర్మించుకున్నా తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా ఉంటే ఊరుకునేదిలేదన్నారు. గోదావరి, కృష్ణా నీటి నికర జలాలపై ట్రిబ్యునల్‌లో క్యాటగిరిల వారిగా వాటా స్పష్టంగా ఉందని, ఆ మేరకు ప్రాజెక్టులు కట్టి తీరుతామని మంత్రి అన్నారు. ఇచ్చంపల్లి ప్రాజెక్టుకుతోపాటు పై ప్రాంతంలో కావాల్సిన ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటామన్నారు.

తెలంగాణకు రావాల్సిన నీటివినియోగంపై కేంద్రం ముందుకు వచ్చి ప్రాజెక్టుల నిర్మాణానికి అనుమతి ఇవ్వాల్సిందేనన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంకు 10 సంవత్సరాల నుంచి కేంద్రం అనుమతి ఇవ్వకుండా తొక్కిపెట్టిందన్నారు. 10 ఏళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్, బీజేపీ నీటిని వినియోగించుకోకుండా సమయాన్ని వృథా చేశాయన్నారు. గోదావరి నదిలో వృథాగా పోతున్న నీరు అనేది కేంద్ర ప్రభుత్వం నిర్ధారించాలన్నారు. గోదావరి నదిలోని వరదనీటిని ఉపయోగించుకోవచ్చని, బనకచెర్ల ప్రాజెక్టు విషయం ఆనాటి అధికార బీఆర్‌ఎస్ ప్రభుత్వమే పక్కరాష్ట్రానికి సలహా ఇచ్చిందని ఆరోపించారు.

సీఎం రేవంత్‌రెడ్డి, భారీనీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కేంద్రప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేశారన్నారు. యూరియాకు సంబంధించిన ఇండెంట్‌ను కేంద్రానికి 4, 5 నెలల నుంచి పంపిస్తున్నామని, పూర్తి స్థాయిలో సరఫరా చేయడంలో విఫలమైందని అన్నారు. వచ్చిన యూరియాలో కొరత రాకుండా సర్దుబాటు చేస్తున్నామని, అక్కడక్కడ కృత్రిమ కొరత కావాలని సృష్టిస్తున్నారని అన్నారు. చైనా నుంచి ఎరువులు దిగుమతి చేసుకుంటున్నామని, ఆ దేశంతో ఉన్న ఆంక్షలు కారణంగా కేంద్రం సరైన విధానం అవలంబించక పోవడంతో యూరియా కొరత ఏర్పడిందని అన్నారు. ఆర్థిక పరిస్థితిపై మొదటి అసెంబ్లీ సమావేశాల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క శ్వేతపత్రాన్ని విడుదల చేశారని, సంక్షోభం నుంచి బయటకు వచ్చే ప్రయత్నాలను ప్రజలకు చెప్పామని అన్నారు. ఆర్థిక పరిస్థితిని గాడిలోపెట్టినప్పుడు కొన్ని ఇబ్బందులు వస్తుంటా యన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం లక్షల కోట్లు అప్పు చేసినదానికి ప్రతినెల 6వేల కోట్లు వడ్డీ, అసలు రూపంలో చెల్లిస్తున్నామన్నారు.

న్యాయవాది వామనరావు దంపతుల హత్య కేసులో ఎవరిపై వ్యక్తిగత ద్వేషంలేదని, ఆనాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. సీబీఐ లోతుగా విచారణ జరుపుతుందని, అసలు దోషులు, వారికి సహకరించిన నాటి ప్రభుత్వ పెద్దలందరు బయటకు వస్తారన్నారు. చిన్న కాళేశ్వరంను గత ప్రభుత్వం 10 ఏళ్ల పక్కన పెట్టిందని, పిల్ల కాలువలు, భూసేకరణకు వెంటనే అనుమతులు ఇవ్వాలని సీఎంను కోరామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో లాభం జరిగిందని బీఆర్‌ఎస్ నాయకులంటున్నారని, రైతులకు లాభం జరగడం సంతోషకరమే కాని నష్టం ఎంత జరిగిందనేది తెలియాలన్నారు. నాణ్యత, డిజైన్, ఇంజనీరింగ్, ప్లానింగ్‌ల విషయంలో కమిషన్ ఏర్పాటై, రిపోర్ట్ ఇచ్చిందని, కమిషన్ రిపోర్టు ప్రధాన అంశాలను ప్రభుత్వం ప్రజలముందుపెట్టిందన్నారు. రిపోర్టుపై అసెంబ్లీలో చర్చించిన తరువాత నిర్ణయముంటుందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, ఆర్టీఏ సభ్యుడు పడాల రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ఆవిష్కర్తలకు గుర్తింపు

18 మందికి ఇన్నోవేటర్ ఐడీ కార్డులు



ఇన్నోవేటర్లతో మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లో శుక్రవారం పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ఇన్నోవేషన్ సెల్(టీజీఐసీ) 18 మంది గ్రామీణ ఆవిష్కర్తలను సత్కరించింది. ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా వీరికి ఇన్నోవేటర్ ఐడి కార్డులు అందించారు. ఇన్నోవేటర్లు తమ ఆలోచనలను అంకుర సంస్థలుగా మార్చి, సమాజంపై సానుకూల ప్రభావాన్ని చూపుతారని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, టీజీఐసీ సీఈఓ మీరాజ్ ఫాహీమ్ వంటి ప్రముఖులు హాజరయ్యారు. ఈ ఐడి కార్డులు ఇన్నోవేటర్లకు ప్రత్యేక గుర్తింపు తెస్తాయి. దీని ద్వారా వారు జాతీయ, రాష్ట్ర స్థాయి కార్యక్రమాలు, సంస్థలు, మార్కెట్ అవకాశాలను సులభంగా పొందవచ్చు, తద్వారా వారి ఎదుగుదలకు, విజయానికి తోడ్పడతాయి.

తమ సృజనాత్మక ఆలోచనలు, ఉమ్మడి ప్రయత్నాల ద్వారా మొత్తం రూ. 20 కోట్లకు పైగా ఆదాయం సమకూరింది. ఇది వారి శ్రమకు, తెలివితేటలకు నిదర్శనం అని ప్రముఖులు పేర్కొన్నారు. టీజీఐసీ వారి ప్రయాణంలో కీలక పాత్ర పోషించి, వారి కార్యకలాపాలను విస్తరించడానికి రూ. 1.75 కోట్లకుపైగా నిధులు సమకూర్చింది. సాధారణ గుర్తింపు కార్డుగా కాకుండా, ఈ కార్డు లు కొత్త స్థాయి మద్దతు, గుర్తింపునకు మార్గదర్శిగా ఉపయోగపడతాయి. రాష్ట్ర, జాతీయ ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొన్నప్పుడు ప్రాధాన్యం లభిస్తుంది. ఈ కార్డుల ద్వారా పెట్టుబడిదారులు, వినియోగదారులను పరిచయం చేసుకునే అవకాశం లభిస్తుంది. తద్వారా వారు తమ మార్కెట్‌ను విస్తరించుకోవచ్చు. ఈ సందర్భంగా టీజీఐసీ సీఈఓ మీరాజ్ ఫాహీమ్ మాట్లాడుతూ టీజీఐసీ లక్ష్యం ఎల్లప్పుడూ ప్రతి స్థాయిలోనూ ఇన్నోవేటర్లను ప్రోత్సహించడమే. ఈ ఐడి కార్డులు వారి సామర్థ్యంపై మా నమ్మకానికి, వారికి కొత్త అవకాశాలను తెరిచేందుకు చిహ్నం అని అన్నారు.



కొనసాగుతున్న నీటి విడుదల

రామడుగు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలంలో లక్ష్మీపూర్ గాయత్రీ పంప్ హౌస్ నుంచి మిడ్ మానేరుకు బుధవారం నుంచి ప్రారంభమైన నీటి విడుదల కొనసాగుతోంది. శుక్రవారం పంప్ హౌజ్ నుంచి 9450 క్యూసెక్కుల నీటిని వరద కాల్వకు విడుదల చేయగా నేరుగా మిడ్ మానేరుకు తరలి వెళుతున్నాయి.



ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న సౌమ్య, వనజ

అవార్డు అందుకున్న ఆదర్శ మండల సమాఖ్య

ఇల్లంతకుంట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్థికాభివృద్ధి సాధించిన ఆదర్శ మండల సమాఖ్య అధ్యక్షురాలు కట్ట సౌమ్య, మాజీ అధ్యక్షురాలు బొడిగ వనజలు ఢిల్లీలో అవార్డులు అందుకున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలోని సుబ్రహ్మణ్యం ఆడిటోరియంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర మంత్రులు శివరాజ్‌సింగ్‌చౌహాన్, కమలేశ్ పాస్వాన్, చంద్రశేఖర్‌ల చేతుల మీదుగా అవా ర్డును అందుకున్నారు. మహిళా సంఘాల అభివృద్ధి, సామాజిక కార్యక్రమాలతో పాటు ఇచ్చిన రుణాలను రికవరీ చేయడంలో అగ్రగామిగా నిలవడంతో జాతీయ స్థాయిలో ఆత్మనిర్భర్ సంఘటన్ అవార్డుకు సదరన్ రీజియన్ నుంచి ఎంపికయ్యారు. వేదికపై సంఘం ఎలా అభివృద్ధి చెందింది, ఎలాంటి సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నారని నిర్వాహకులు అడిగిన ప్రశ్నలకు అధ్యక్షురాలు వనజ సమాధానాలు ఇచ్చారు.

ఉత్తమ ఉద్యోగులకు ప్రశంస...



ప్రశంసా పత్రం అందుకుంటున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లి జిల్లాలో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పరేడ్ మైదానంలో జరిగిన వేడుకల్లో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ఒబేదుల్లా కొత్వాల్ సాహెబ్ ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్, కలెక్టర్ కోయ శ్రీహర్ష తదితరులు ఉన్నారు. - పెద్దపల్లి, ఆంధ్రజ్యోతి



డాక్టర్ ప్రసన్నకుమారి, డీఎంహెచ్‌వో | శ్రీకాంత్, సివిల్ సప్లయి డీఎం | ప్రవీణ్‌రెడ్డి డీఎంవో | రాజేశ్వర్‌రావు హౌసింగ్ పీడీ | గంగయ్య ఆర్డీవో, పెద్దపల్లి | సురేష్ ఆర్డీవో, మంథని | డాక్టర్ శ్రీధర్ డీసీహెచ్ | డి.శ్రీనివాస్ కలెక్టరేట్ ఏవో | ప్రకాష్ కలెక్టరేట్ సూపరింటెండెంట్ | ఆరిఫ్ కలెక్టరేట్ సూపరింటెండెంట్ | బషీరొద్దీన్ తహసీల్దార్ సుల్తానాబాద్ | ఎం. వాసంతి తహసీల్దార్ కమాన్‌పూర్



శ్రీవాణి కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్ | లక్ష్మణ్‌రావు ఎస్ఐ, పెద్దపల్లి | ఎస్. స్వామి ఎస్ఐ, బసంత్‌నగర్ | భూపతి హౌసింగ్ శాఖ జేఈ | శ్రీకర్ డీపీఆర్‌వో అసిస్టెంట్ | కొప్పుల శ్రీనివాస్ ఎంపీడీవో, పెద్దపల్లి | ఆవుల శ్రీనివాస్ కార్యదర్శి, ముత్తారం | సతీష్‌కుమార్ డీఎల్‌పీవో, మంథని | సనత్‌కుమార్ ఎస్ఐ, జూలపల్లి



ఆర్జీ1 జీఎం కాలనీ మైదానంలో విద్యార్థుల ప్రదర్శన

రెపరెపలాడిన మువ్వన్నెల జెండాలు



కాల్వశ్రీరాంపూర్ సింగిల్ విండో కార్యాలయం, సుల్తానాబాద్ మున్సిపాలిటీలో జెండా ఎగురవేస్తున్న కమిషనర్ రమేష్, ఓదెల కోర్టులో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జడ్జి మంజుల, కాల్వశ్రీరాంపూర్‌లో స్వాతంత్ర్య సమరయోధుడిని సన్మానిస్తున్న తహసీల్దార్, బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న కోరుకంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, వ్యవసాయ మార్కెట్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, కమాన్, జెండా, మసీదు చౌరస్తా, బస్టాండ్ సమీపంలోని వ్యాన్ అసోసియేషన్, రైల్వే స్టేషన్ హమాలీ కార్యాలయం వద్ద పలు ప్రాంతాల్లో జాతీయ జెండా ఆవిష్కరించారు. కేంద్ర గ్రంథాలయంలో చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ జెండా ఎగురవేశారు. విద్యాసంస్థల వ్యవస్థాపకుడు దాసరి మనోహర్ రెడ్డి ఆయా పాఠశాలల్లో జాతీయ జెండాను ఆవిష్కరించి విద్యార్థులను పోషకులను ఉద్దేశించి మాట్లాడారు. అజిత్‌తోపాటు ఆయా సంస్థల ప్రిన్సిపాల్‌లు, ఏఓలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎందరో మహానుబావుల త్యాగ ఫలితమే నేడు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్నామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల అనంతరం వారు మాట్లాడుతూ ఎందరో త్యాగాలు, మాజీ మంత్రి కేసీఆర్ ఉద్యమ ఫలితమే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అన్నారు.

సుల్తానాబాద్,(ఆంధ్రజ్యోతి): మున్సిఫ్ కోర్టులో జడ్జి దుర్గం గణేష్, తహసీల్దార్ బషీరొద్దీన్, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, మున్సిపాలిటీలో కమిషనర్ తిప్పరాజు రమేష్, పోలీస్‌స్టేషన్‌లో సీఐ సుబ్బారెడ్డి, ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, మార్కెట్ కమిటీలో చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, సొసైటీలో కేడీసీసీబీ డైరక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, అధ్యక్షులు శ్రీనివాస్, మోహన్ రావు, కోట వీణ రాజు, గడ్డం మహిపాల్ రెడ్డి, జూపల్లి సందీప్ రావు, సీతఓలు జెండా ఆవిష్కరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో విద్యార్థులచే ర్యాలీలు నిర్వహించారు. పలు సాంస్కృతిక ప్రదర్శనలు జాతీయ నేతల వేషధారణలతో ఆకట్టుకున్నాయి.

మంచరామి ప్రభుత్వ పాఠశాలలో 17 ఏళ్ల క్రితం మూతపడింది. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో పాఠశాలలో జాతీయ జెండా ఎగురవేశారు. ప్రధానోపాధ్యాయురాలు స్వాతి, ఉపాధ్యాయురాలు శిరీష , ఫీల్డ్ అసిస్టెంట్ గట్టయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్‌లో ప్రత్యేక అధికారి శ్రీమాల, తహసీల్దార్ జగదీశ్వర్ రావు, వ్యవసాయ మార్కెట్‌లో చైర్మన్ తిరుపతిరెడ్డి, సింగిల్ విండోలో చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంఈఓ మహేష్, ఎస్ఐ వెంకటేష్, ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్ శ్రీనివాస్, పశువైద్య కేంద్రంలో వైద్యుడు సురేష్, కేడీసీసీ బ్యాంకులో మేనేజర్ కరుణశ్రీ, గ్రామపంచాయతీలో ఎంపీఓ ఆరీఫ్ హుస్సేన్, ఐకేపీలో మండల సమాఖ్య అధ్యక్షురాలు మౌనికలు జెండా ఎగురవేశారు. మాజీ ఎంపీపీ సారయ్య గౌడ్, మాజీ జడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, ఏపీఓ మంజుల, పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద స్వాతంత్ర్య సమరయోధుడు ఎరబాటి రాజేశ్వర్ రావును సన్మానించారు. మీర్జంపేట ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతిలో అధిక మార్కులు సాధించిన తలకోటి శివానికి రూ.5 వేలను మాజీ ఎంపీటీసీ గూడెపు జనార్దన్ రెడ్డి ప్రోత్సాహక బహుమతిగా అందించారు. హెచ్‌ఎం మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ ఉదయ్ కుమార్ జెండా ఆవిష్కరించి వేడుకలను నిర్వహించారు. ఆర్ఐ వరలక్ష్మితోపాటు సర్వేయర్ శ్రీనివాస్, రికార్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులకు ప్రోత్సహక బహుమతులను అందజేశారు. ఎంపీడీఓ బినాల ప్రవీణ్ కుమార్, ఎంఈఓ ప్రభాకర్ జెండా ఆవిష్కరించారు. వ్యవసాయ మార్కెట్‌లో చైర్మెన్ లావుడ్య రూప్లానాయక్ జెండా ఆవిష్కరించిన అనంతరం సెక్రెటరీ సరోజతో కలసి హమాలీలకు దుస్తులు పంపిణీ చేశారు. మేడారం సహకారం సంఘంలో ప్యాక్స్ చైర్మెన్ ముత్యాల బలరాంరెడ్డి జెండా ఆవిష్కరించారు. ఆయా పార్టీల కార్యాలయాల్లో జెండాలు ఆవిష్కరించారు. ఉన్నత పాఠశాల విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో నిర్వహించిన ర్యాలీ, ఆదర్శ పాఠశాల విద్యార్థులు అంబేడ్కర్ చౌరస్తాలో ప్రదర్శన ఆకట్టుకున్నాయి.

కమాన్‌పూర్ (ఆంధ్రజ్యోతి): మండలంతోపాటు పలు గ్రామాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఎస్ఐ కొట్టె ప్రసాద్, తహసీల్దార్ వాసంతి, ఏఎంసీ చైర్మన్ ఇనుగంటి భాస్కర్‌రావు, ఎంపీడీఓ లలిత జెండావిష్కరించారు. పార్టీ కార్యాలయాల్లో సయ్యద్ అన్వర్, తాటికొండ శంకర్, సతీష్ జాతీయ జెండాను ఎగురవేశారు. మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని జూనియర్ సివిల్ కోర్టులో మున్సిఫ్ కోర్టు జడ్జి మంజుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తహసీల్దార్ ధీరజ్ కుమార్, ఎంపీడీవో తిరుపతి, ఎస్ఐ రమేష్ జాతీయ పతాకాలను ఎగురవేశారు. సింగిల్ విండో చైర్మన్ ఆళ్ళ సుమన్ రెడ్డి, ఎంఈఓ రమేష్, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో కార్యదర్శులు, మల్లికార్జున స్వామి ఆలయంలో ఈవో సదయ్య జెండావిష్కరణ చేశారు. ఎస్ఐ దీకొండ రమేష్, ఏవో భాస్కర్, మల్టీపర్పస్ హెచ్‌ఏ. విద్యాసాగర్‌లు జిల్లా కేంద్రంలో అవార్డులను అందుకున్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, పిహెచ్‌సి, పోలీస్‌స్టేషన్‌లలో అధికారులు జాతీయ జెండాలను ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీ, గనులు, ప్రాజెక్టుల పై జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఏఐటీయుసీ, ఐఎన్‌టీయుసీ, హెచ్‌ఎంఎస్, టీబీజీకేఎస్, సీఐటీయు, బీఎంఎస్ నాయకులు వారి కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. వాణి, కృష్ణవేణి, ప్రగతి పాఠశాలలకు చెందిన విద్యార్థులు జాతీయ జెండాతో తెలంగాణ సెంటర్ నుంచి పన్నూరు వరకు ర్యాలీని చేపట్టారు.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ జెండాను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కాళిందిని ఆవిష్కరించారు. తహసీల్దార్ రాజయ్య , ఏవో అలివేణి, సింగిల్ విండో చైర్మన్ మాది రెడ్డి నరసింహారెడ్డి, చింతపండు సంపత్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు మమత, శ్రవన్‌కుమార్‌లు జాతీయ జెండాను ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఉత్తమ ఎంపీడీవోగా కొప్పుల శ్రీనివాస్‌ను, ముత్తారం కార్యదర్శి ఆవుల శ్రీనివాస్ పురస్కారాలు అందుకున్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ యాకయ్య, ఎంపీడీఓ భాస్కర్ రావు, ఏఓ ఉమాపతి, ఐకేపీలో ఏపీఎం గీతా, వైద్యులు నిస్సిక్రిస్టానా రుూస్సీ, ఏఈ సంపత్‌రెడ్డి, ఎస్ఐ తనుగుల సత్యనారాయణ, మండల విద్యాధికారి నరేంద్రచారి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం గంద్ర దేవేందర్ రావు, బిజిలి సదయ్య, పులి వెంకటేశ్వర్ రెడ్డి, దేవేందర్, సింగిల్ విండో కార్యాలయాల్లో గోపు విజయభాస్కర్ రెడ్డి, పుల్లూరి వేణుగోపాల్ రావు ఆయా కార్యాలయాల్లో జెండా ఎగరవేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన కోడూరి సాహిత్యకు రూ.5 వేలు, ద్వితీయ రూ.3 వేలు బైకం అక్షయ, తృతీయ అడ్డగుంట కాత్యానికి రూ.2 వేలను నా నేస్తం స్వచ్చంద సంస్థ నిర్వాహకులు అందజేశారు. ముప్పిరితోటలో విద్యార్థులు తయారు చేసిన పేపర్ ప్లేట్లలో స్వీట్లు పంపిణీ చేశారు.

కళ్యాణ్‌నగర్/మార్కండేయకాలనీ,(ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో స్వాతంత్ర్య వేడుకలను నిర్వహించారు. బీఆర్ఎస్ కార్యాలయంలో కోరుకంటి చందర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. బీజేపీ ఆధ్వర్యంలో చౌరస్తాలో నిర్వహించిన వేడుకలకు రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి జెండావిష్కరణ చేశారు. సింగరేణి మెడికల్ కళాశాలలో, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు జెండావిష్కరణ చేశారు. సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, ఆర్ఎంఓ రాజు, అరుణతో పాటు ప్రొఫెసర్లు పాల్గొన్నారు. శివాజీనగర్‌లో మహిళా మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్య జెండా ఎగురవేశారు. విఠల్‌నగర్ పాఠశాలలో మాజీ కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్విని, 25వ డివిజన్ సాయినగర్‌లో మాజీ కార్పొరేటర్ నగునూరి సుమలతరాజు జెండావిష్కరణ చేశారు. బాపూజీనగర్‌లో కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి జెండావిష్కరించారు. చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకుడు వ్యాల్ల హరీష్‌రెడ్డి జెండావిష్కరించారు. అడ్డగుంటపల్లి కృష్ణవేణి పాఠశాలలో డైరెక్టర్ మంజులశ్రీనివాస్ జెండావిష్కరణ చేశారు.

జ్యోతినగర్, (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ ఏరియాలో వాడవాడలా మువ్వన్నెల జెండాలు రెపరెపలాడాయి. టీటీఎస్‌లోని రవాణాశాఖ కార్యాలయంలో ఎంవీఐ కె.సంతోష్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్లో సీఐ ప్రవీణ్‌కుమార్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎస్ఐ ఉదయ్ కిరణ్, ఎఎస్ఐ నాయుడు, జవానులు పాల్గొన్నారు. ఎన్టీపీసీ ప్లాంటు రెండవ గేటు వద్ద బీఎంఎస్ ఆధ్వర్యంలో కాంట్రాక్టు కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి జి.పురుషోత్తం జాతీయ జెండాను ఆవిష్కరించారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ జక్కని స్వర్ణ, ఎంపిడిఓ పద్మజ, ఎస్ఐ సనత్‌కుమార్, వెలుగుదీప్తి సమైక్య భవనంలో ఏపిఎం సుధాకర్, వ్యవసాయ మార్కెట్‌లో చైర్మెన్ గండు సంజీవ్, సింగిల్‌విండో కార్యాలయంలో చైర్మెన్ కొంజర్ల వెంకటయ్య, డాక్టర్ సంపత్‌రెడ్డి, జెండాలను ఎగురవేసారు. ఎస్ఐ సనత్‌కుమార్, కానిస్టేబుల్ పవన్‌కుమార్‌లకు జిల్లాకేంద్రంలో ఉత్తమ సేవ ప్రశంసా పత్రాన్ని అందించారు.

గోదావరిఖని, (ఆంధ్రజ్యోతి): మహానుబావుల త్యాగ ఫలితమే స్వాతంత్ర్యమని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం సాధించిన మహనీయుల అడుగుజాడల్లో నడువాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ఈ బొంతల రాజేష్, మహంకాళి స్వామి, ముస్తాఫా, పెద్దెల్లి ప్రకాష్, జాలి రాజమణి, కొలిపాక సుజాత, అశోక్, నెలకంటి రాము, పాల్గొన్నారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కమిషనర్ వెంకన్న, రెవెన్యూ డివిజనల్ ఆఫీసులో ఆర్డీవో సురేష్, తహసీల్దార్ కార్యాలయంలో కుమారస్వామి, ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో కళావతి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీనుబాబు పాల్గొనగా సింగిల్ విండో కార్యాలయ ఆవరణలో చైర్మన్ కొత్త శ్రీనివాస్, కాంగ్రెస్, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అయిలి ప్రసాద్, ఏగోళపు శంకర్‌గౌడ్‌లు జెండాలను ఆవిష్కరించారు. విద్యార్థులు చేసిన పలు సంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఎంతగానో అలరించాయి.

కోల్‌సిటీ, (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య భారతాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్దులు కావాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కమిషనర్ అరుణశ్రీ జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అమరుల త్యాగాలను స్మరించుకుంటూ దేశాన్ని అన్నీ రంగాల్లో అభివృద్ధి చేయడంలో తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలన్నారు. రామగుండం నగరాభివృద్ధికి ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి ఇంటికి నీరు అందించేందుకు రూ.88కోట్లతో 8ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైప్‌లైన్ల నిర్మాణం చేపడుతామన్నారు. 257 స్వయం సహాయక సంఘాలకు రూ.13.8కోట్ల బ్యాంకు లింకేజీని స్త్రీ నిధి పరపతి సహాయ సమాఖ్య తరఫున అందించారు. బీమా చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మాజీ మేయర్లు బంగి అనీల్ కుమార్, జాలి రాజమణి, డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, ఎస్ఈ శివానంద్, ఈఈ రామన్, ఏసీపీ శ్రీహరి, అకౌంట్స్ ఆఫీసర్ రాజు, ఆర్ఓ ఆంజనేయులు, పాల్గొన్నారు.

గోదావరిఖని అదనపు జిల్లా న్యాయస్థానంలో న్యాయమూర్తి టీ శ్రీనివాసరావు, మున్సిఫ్ మెజిస్ట్రేట్ కాంప్లెక్స్‌లో న్యాయమూర్తి వెంకటేష్ దుర్వ జాతీయ పతాకావిష్కరణ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు తౌటం సతీష్, సిరిగ సంజయ్‌కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడుకలలో మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం పాల్గొని జెండా ఆవిష్కరించారు. పీఏసీఎస్ చైర్మన్ అల్లాడి యాదగిరిరావు, బక్కతట్ల వినీత్, గాదం శ్రీనివాస్, వాజీద్‌బాషా, నాయకులు, పాల్గొన్నారు.



బ్యాంకులింకేజిని అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, జాతీయ జెండాకు వందనం చేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీనుబాబు, జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, నాయకులు

పత్తిపాక రిజర్వాయర్‌తో నెరవేరనున్న రైతుల ఆకాంక్ష

(5వ పేజీ తరువాయి)

డంప్ యార్డుల వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టామని, అమృత్ పథకం 2.0 కింద 293కోట్ల 84లక్షలతో సీవర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌లు నిర్మిస్తున్నామన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కవరే జీని 5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచి జిల్లాలో 28,550 మంది రోగులకు 68 కోట్ల 67 లక్షల రూపాయల విలువ గల చికిత్స లను ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా అందిం చామన్నారు. 23 కోట్ల 75 లక్షలతో గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్, 51 కోట్లతో పెద్దపల్లిలో 100 పడకల ఆసుపత్రి, 22 కోట్లతో మంథనిలో 50 పడకల ఆసుపత్రి నిర్మిస్తున్నామని అన్నారు.

● రూ. 15.81 కోట్లతో పాఠశాలల అభివృద్ధి..

భావితరాల మెరుగైన భవిష్యత్తుకు విద్యే పునాది. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కమి టీల ద్వారా 15 కోట్ల 81 లక్షలు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి పనులు పూర్తి చేశామని తెలిపారు. రాబోయే విద్యా సంవ త్సరంలో ఏఐ టూల్స్, ఐఎఫ్‌పీ ప్యానల్స్ ద్వారా విద్యార్థులకు బోధించుటకు జిల్లాలోని ఉపాధ్యా యులకు శిక్షణ అందించామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ, బీసిలకు 42 శాతం రిజర్వేషన్‌తో సామాజిక తెలంగాణ సాధనకు కృషి చేస్తున్నా మని తెలిపారు. 561 మందికి ఉపాధి కల్పిస్తూ జిల్లాలో 39 కోట్ల పెట్టుబడితో 44 వ్యాపార యూనిట్‌లకు అనుమతులు మంజూరు చేశా మని, ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కిం ద 12 యూనిట్‌లను మంజూరు చేశామని, టీ- ప్రైడ్, టీ-ఐడియా కింద 27 సేవా రంగ, తయారీ రంగ పరిశ్రమలకు 2 కోట్ల 41 లక్షల సబ్సిడీ విడుదల చేసిందన్నారు. జిల్లా అభివృద్ధికి, సంక్షేమ పథకాల అమలుకు పాటు పడుతున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీ, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందికి రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ఒబేదుల్లా కోత్వాల్ సాహెబ్ కృతజ్ఞతలు తెలి పారు. అనంతరం ముఖ్య అతిథి జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 203 మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు పంపిణీ చేశారు. 10వ తరగతి, ఇంటర్‌లో టాపర్లుగా నిలిచిన నలుగురు విద్యా ర్థులకు 10 వేల చొప్పున నగదు పురస్కారాలను అందజేశారు. మెప్మా కింద 148 స్వయం సహా యక మహిళా సంఘాలకు 17 కోట్ల 36 లక్షల 98 వేల రూపాయల బ్యాంకు లింకేజీ రుణాలు పంపిణీ చేశారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష, పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు చింతకుంట విజయర మణారావు, రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, అదనపు కలెక్టర్లు జెఅరుణశ్రీ, డి వేణు, డీసీపీ కరుణాకర్, ఆర్‌డీఓ బి గంగయ్య, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

మక్కాన్‌సింగ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సీఎం

గోదావరిఖని, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా శ్రేయస్సులో నిరంతరం భాగస్వామ్యం కావాలని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని, సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని సీఎం ఆకాంక్షించారు.

పురగిరి క్షత్రియ పెరిక సంఘం కార్యవర్గం



ఓదెలలో ఏకగ్రీవంగా ఎన్నికైన పెరిక సంఘం కార్యవర్గం

ఓదెల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పురగిరి క్షత్రియ పెరిక సంఘం భవన్‌లో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 11 మందితో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కానుగంటి ఎర్ర శంకరయ్య, ఉపాధ్యక్షులుగా తీర్థాల వీరయ్య, అప్పని కుమారస్వామి, చింతం వెంకటస్వామి, బుద్దే చిన్న రామస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా సింగిల్ విండో డైరెక్టర్ చింతం కుమారస్వామి, సహాయ కార్యదర్శులుగా ఎంబాడి తిరుపతి, గోపతి ఎర్ర మల్లయ్య, బుద్దే మహేందర్, దోమ్మటి సదయ్య, కోశాధికారిగా బోడకుంట రామచంద్రం ఎన్నుకున్నారు.

సబ్బితం జలపాతాన్ని అభివృద్ధి చేస్తా

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : సబ్బితం జలపాతాన్ని అభివృద్ధి చేస్తానని, ప్రభుత్వాన్ని ఒప్పించి నిధులు మంజూరు చేయించానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. శుక్రవారం ఫారెస్ట్ అధికారుల నివాస గృహ సముదాయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించి ఇళ్ల నిర్మాణాలకు ముగ్గు పోశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ వన మహోత్సవంలో భాగంగా ప్రతి ఇంటిలో మొక్కలు నాటాలన్నారు. గత ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో విచ్చలవిడిగా కోతలు విధించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గింజ కటింగ్ లేకుండా కొనుగోళ్లు చేసినట్లు తెలిపారు. సబ్బితం జలపాతం అభివృద్ధికి రూ.6 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ అన్నయ్యగౌడ్, జిల్లా ఫారెస్ట్ అధికారి శివయ్య, వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ ఈర్ల స్వరూప, ప్రకాష్‌రావు, ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్, గ్రామ ప్రత్యేకాధికారి రాజ్యలక్ష్మీ, కార్యదర్శి అఫ్జల్ పాష, పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

మంథని, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): జెడ్పీహెచ్‌ఎస్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్కాలర్ షిప్స్ పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కూర సంతోష్ సౌజన్యంతో అందించారు. 6వ తరగతిలో పల్లవి, రాధే ప్రోక్తప్రవస్తిలకు రూ.1500ల చొప్పున, 7వ తరగతిలో జావర్ తనుశ్రీ, రిక్షతలకు రూ. 2వేల చొప్పున, 8వతరగతిలో కీర్తనప్రియ, సాయివైష్ణవిలకు రూ. 3వేల చొప్పున, 9వతరగతిలో విక్రాంత్, పరమేష్‌లకు రూ.3500ల చొప్పున హెచ్‌ఎం సుదాడి సుమలత, ఉపాధ్యాయులు పంపిణీ చేశారు. టీచర్లుగా పని చేస్తున్న పరంజ్యోతి రూ.10వేలు, చౌడారపు శ్రీనివాస్ తండ్రి మురళీ స్మారకంగా రూ.5 వేలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీచరుగా పని చేస్తున్న శ్రీలక్ష్మి రూ.3500 విరాళంగా ప్రకటించి పదో తరగతిలో టాపర్లుగా నిలిచిన ఏ. సంజన, మణిదీప్‌లకు అందించారు.

మంథనిరూరల్: కన్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అంబేద్కర్ విద్యా జ్యోతి పథకం ద్వారా లభించే స్కాలర్‌షిప్స్‌ను అందజేశారు. 7, 8, 9, 10వ తరగతి చదువుతున్న జాహ్నవి, సింధూజ, వీక్షిత, రిషితలు టాపర్‌గా నిలవడంతో వీరికి ఒక్కొక్కరికి రూ, 5వేల చెక్కులను కెనరా బ్యాంకు మేనేజర్ రాజయ్య అంద జేశారు.

కోల్‌సిటీటౌన్, (ఆంధ్రజ్యోతి): జనగామలోని జెడ్పీ పాఠశాలలో విఠల్‌నగర్, ఎల్కలపల్లి, జనగామ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తూ ప్రథమ స్థాయిలో వచ్చిన బాలికలకు కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్ పాస్‌బుక్‌లు అందజేశారు. 5, 6, 7 తరగతుల వారికి రూ.3వేలు, 8,9,10 తరగతి విద్యార్థులకు రూ. 5వేల బ్యాంక్ మేనేజర్ అజిత్ పరిచ అందించారు. బ్యాంక్ సిబ్బంది రఘు, ప్రధానోపాధ్యాయురాలు జ్యోష్ణలత, సిబ్బంది పాల్గొన్నారు.

శాకాంబరి అవతారంలో భవాని మాత

ఓదెల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : పొత్కపల్లిలో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహాలింగేశ్వర స్వామి ఆలయంలో భవాని మాత శాకంబరీగా దర్శనమిచ్చింది. తాడూరి శ్రీదేవి ఆధ్వర్యంలో మహిళలు కాకరకాయలు, బెండకాయలు, దొండకాయలు, మిర్చి, ఆలుగడ్డ, కొత్తిమీర, క్యారెట్ ఏడు రకాల కూరగాయల తో అలంకరించారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదినం

కళ్యాణ్‌నగర్/మార్కండేయకాలనీ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ జన్మదినాన్ని శుక్రవారం కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో రక్తదానం, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్తదానం చాలా గొప్పదన్నారు. బొంతల రాజేష్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలకు మక్కాన్‌సింగ్ హాజరై కేక్‌కట్ చేసి అన్నదానం చేశారు. తాళ్లపల్లి యుగంధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే సతీమణి మనాలీ ఠాకూర్ ప్రారంభించారు. కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ముందు కేక్‌కట్ చేశారు.

వీరుల త్యాగఫలంతోనే దేశానికి స్వాతంత్ర్యం



ఆర్జీ-2లో జాతీయ పతాకానికి వందనం చేస్తున్న అధికారులు, ఉత్తమ కార్మికులను సత్కారిస్తున్నా జీఎం, అధికారులు

రామగిరి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): వీరుల త్యాగ ఫలంతోనే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. జీఎం కార్యాలయం ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జీఎం మాట్లాడారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి సంస్థగానే కాకుండా తెలంగాణకు మణిహారంగా ఉందన్నారు. సోలార్, థర్మల్ విద్యుత్తులో అడుగువేసిందన్నారు. సింగరేణి యాజమాన్యం కార్మికుల సంక్షేమంతోపాటు ప్రభావిత గ్రామాల అభివృద్ధి చేపడుతుందన్నారు. అనంతరం ఉత్తమ కార్మికుల కుటుంబాలను సన్మానించారు. ఉత్తమ సెక్యూరిటీ గార్డులను పారితోషికంతోపాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఏపిఏ జీఎం నాగేశ్వర్‌రావు, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, రాజశేఖర్, సేవా అధ్యక్షురాలు అలివేణి, వెంకటలక్ష్మి, అధికారులు శేఖర్‌బాబు, రామ్మోహన్, శేఖర్‌బాబు, యాదయ్య, నాగేశ్వర్‌రావు, సత్యనారయణ, సుదర్శనం, పాల్గొన్నారు.

అనంతరం జీఎం కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెయిన్‌ను ఆర్జీ-3, ఏపిఏ జీఎంలు సుధాకర్‌రావు, నాగేశ్వర్‌రావులు ప్రారంభించారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘం నాయకులు వై.వీరావు, ఎంఆర్‌సీ రెడ్డి, కొటరవీందర్‌రెడ్డి, అధికార సంఘం ప్రతినిధులు శ్రీనివాస్, సేవా అధ్యక్షురాలు అలివేణి, ఏరియా ఇంజనీర్ వై.వి శేఖర్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

ఆర్జీ-2 ఏరియాలో

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియా ఉత్పత్తి లక్ష్యాలను సాధించి సంస్థ అభివృద్ధిలో ముందుడంతోపాటు దేశాభివృద్ధిలో భాగస్వాములం కావాలని ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య పిలుపునిచ్చారు. కమ్యూనిటీహాల్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జీఎం జెండా ఆవిష్కరణ చేశారు. ఎస్అండ్‌పీసీ, ఎస్‌సీసీ సిబ్బంది గౌరవవందనాన్ని స్వీకరించి మాట్లాడారు. రాష్ట్ర విద్యుత్ అవసరాల ను తీర్చే విధంగా బొగ్గును అందజేస్తూ సింగరేణి అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నట్టు తెలిపారు. ఏరియాలో ఎంపిక చేసిన కార్మికులను సన్మానించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రవీందర్, నర్సింహులు, జీఎం సంతోష్‌కుమార్, డీజీఎం పర్సనల్ అరవిందరావు పాల్గొన్నారు.

యూనియన్ కార్యాలయాల్లో..

గోదావరిఖని, (ఆంధ్రజ్యోతి): టీబీజీకేఎస్ కార్యాలయంలో ఆర్‌జీ-1 ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి శంకర్ ఆధ్వర్యంలో మిర్యాల రాజిరెడ్డి, కోరుకంటి చందర్ ముఖ్య అతిథిగా హాజరై జెండావిష్కరించారు. నూనె కొమురయ్య, పర్లపల్లి రవి, చెల్పూరి సతీష్, పొలాడి శ్రీనివాస్, చెలుకలపల్లి శ్రీనివాస్, పాల్గొన్నారు. గాంధీనగర్‌లోని బీఎంఎస్ కార్యాలయంలో యూనియన్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య జెండావిష్కరణ చేశారు. భాస్కర్‌రావు భవన్‌లో ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు ఆరెల్లి పోషం, కనకరాజు జెండావిష్కరణ చేశారు. నాయకులు రంగు శ్రీనివాస్, రమేష్, సోహెల్, రవి పాల్గొన్నారు. హెచ్‌ఎంఎస్ కార్యాలయంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ జెండావిష్కరణ చేశారు.